క్లుప్తంగా

ఓటరు స్లిప్పుల పంపిణీ



లక్ష్మాపురంలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓ

నాగారం : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఓటుహక్కు ఉన్న పట్టభద్రులకు బీఎల్‌ఓ మల్లేపాక కవిత శుక్రవారం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, పట్టభద్రులు తప్పనిసరిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు మల్లేపాక యాకయ్య, పందిరి శృతి, శాగంటి యమున, శాగంటి మానస, సాయి, గాయత్రి, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీర్లకొట్టం భవన నిర్మాణం



నిర్మాణంలో ఉన్న పీర్లకొట్టం భవనం

అర్వపల్లి: మండల పరిధిలోని అడివెంల గ్రామంలో ముస్లింలకు చెందిన పీర్ల కొట్టం పూర్తిగా శిథిలమైంది. దీంతో జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి, రేఖ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ, మాజీ సర్పంచ్ మడ్డి పద్మలు తమ గ్రామంలో పీర్లకొట్టం భవనం నిర్మాణానికి ముందుకొచ్చి పనులు చేపడుతున్నారు. సుమారు రూ.4లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం పిల్లర్లు నిర్మించి గోడల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. మాజీ సర్పంచ్ పద్మ దగ్గరుండి ఈ పనులను చేయిస్తున్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

నూతనకల్ : ప్రజా సమస్యలను, నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకనే శాసనమండలికి పంపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ ఓటర్లను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గాజుల తిర్మల్‌రావు, బత్తుల సాయిలుగౌడ్, బిక్కి బుచ్చయ్య, బత్తుల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

హామీని నిలబెట్టుకోవాలి

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో భాగంగా వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండు నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మఠంపల్లిలో ఆ పార్టీ మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం కేవలం సన్నరకాలైన ధాన్యానికి మాత్రమే బోనస్ చెల్లించే అవకాశం ఉందంటూ వస్తున్న వార్తలతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అలాకాకుండా అన్ని రకాల వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. ముఖ్యంగా తెలంగాణలో 80 శాతం దొడ్డు రకం వరి ధాన్యం పండిస్తున్నారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న కడియం పరమేష్

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన నిమ్మల పిచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులు కడియం పరమేశ్వర్ శుక్రవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కందుకూరి నాగార్జున, జాజుల వీరయ్య పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో పంచామృతాభిషేకం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం, సేవాకాలం, స్వామివార్లకు పంచామృతాభిషేకం, మంగళాశాసనం, ఆరగింపు, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం భక్తులు గోమాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

- బీటీ దెబ్బతిని రెన్యూవల్‌కు నోచుకోని పలు గ్రామాల రహదారులు
- మరికొన్ని గ్రామాల రోడ్లకు ఇంకా బీటీ కాని వైనం
- ఫార్మేషన్ రోడ్లను బీటీగా మార్చాలని వినతి



వర్షానికి గుంతల్లో నీరు చేరి అధ్వానంగా ఉన్న బొల్లంపల్లి ఫార్మేషన్ రోడ్డు



గుంతలమయంగా కొత్తగూడెం రోడ్డు

అర్వపల్లి: గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు నిత్యం నరకయాతన పడుతున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే రోడ్లు బురదగుంతలు, కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల బీటీ రోడ్లు పూర్తిగా దెబ్బతినగా, మరి కొన్ని గ్రామాల రోడ్లు ఇంకా బీటీకి నోచుకోలేదు. దీంతో నిత్యం ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని బొల్లంపల్లి, వేల్పుచెర్ల గ్రామపంచాయతీలకు ఇంత వరకు బీటీ రోడ్లు లేవు. బొల్లంపల్లి స్టేజి నుంచి గ్రామానికి కిలోమీటరున్నర దూరం ఉంటుంది. ఈ గ్రామ ఫార్మేషన్ రోడ్డు గుంతలమయమై వర్షపు నీటితో నిండి అధ్వానంగా మారింది. అలాగే వేల్పుచెర్ల గ్రామపంచాయతీ కూడా ఇంత వరకు బీటీ రోడ్డు నిర్మాణం జరగలేదు. ఈ రోడ్డు కూడా గుంతలమయమైంది. ఇక అర్వపల్లి నుంచి కొత్తగూడెం వరకు 6కి.మీ మేర రోడ్డు బీటీ కొట్టుకపోయి కంకర తేలి కనీసం పాదాచారులు కూడా నడవలేని పరిస్థితి ఏర్పడింది. ఈ రహదారి బీటీ రెన్యూవల్‌కు రెండున్నర ఏళ్ల కిందట రూ.70లక్షల నిధులు మంజూరయ్యాయి. టెండర్ జరిగినా పనులు మాత్రం చేపట్టడం లేదు.

మిగిలిన గ్రామాల పరిస్థితి కూడా..

మండలంలోని అర్వపల్లి నుంచి కొమ్మాల రోడ్డు కూడా బీటీ లేచిపోయి పూర్తిగా అధ్వానంగా మారింది. బీటీ రెన్యూవల్ కోసం గత ప్రభుత్వ హయాంలోనే నిధుల మంజూరి కోసం ప్రతిపాదనలు పంపారు. ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. తిమ్మాపురం నుంచి సంగెం మీదుగా నూతనకల్ వరకు రోడ్డు పూర్తిగా పాడైంది. అయితే ఈ రోడ్డు విస్తరణ, అభివృద్ధికి నిధులు మంజూరైనప్పటికి టెండర్ ప్రక్రియ కాక పనులు మొదలు కావడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పూర్తయ్యాక టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. అలాగే పర్సాయపల్లి రోడ్డు కూడా కొంత దెబ్బతింది. అడివెంల బీటీ రోడ్డు కూడా తారు లేచిపోయి గుంతలమయమై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక మండలంలోని వివిధ గ్రామాల లింకురోడ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు బీటీ దెబ్బతిన్న గ్రామాల రోడ్లను రెన్యూవల్ చేయడంతోపాటు కొత్తగా రోడ్ల అభివృద్ధికి మంజూరైన నిధులతో ఆయా గ్రామాల్లో పనులు పూర్తి చేయించి, లింకు రోడ్లను కూడా మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలి



బొల్లంపల్లి స్టేజి నుంచి గ్రామం మీదుగా పర్సాయపల్లి వరకు ఉన్న ఫార్మేషన్ రోడ్డును గతంలో రోడ్లు భవనాలశాఖ పరిధిలోకి మార్చామని అధికారులు చెబుతున్నారు. ఈ రోడ్డు ప్రస్తుతం మట్టిపోయి గుంతలు ఏర్పడి వర్షాలకు నీళ్లు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

– కేసాని రాహుల్, బొల్లంపల్లి

రోడ్డుకోసం పోరాడుతున్నాం



వేల్పుచెర్ల గ్రామపంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి బీటీ రోడ్డు కోసం పోరాడుతున్నాం. ఇప్పటి వరకు మా గ్రామానికి ఫార్మేషన్ రోడ్డే. ఈ రోడ్డు మట్టి కొట్టుకపోయి దెబ్బతింది. చిన్నపాటి వర్షం వచ్చినా నీళ్లు నిలిచి ఇబ్బంది పడుతున్నాం. గతంలోనే బీటీ రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికైనా ఫార్మేషన్ రోడ్డును బీటీగా మార్చాలి.

– చిక్కుళ్ల శేఖర్, వేల్పుచెర్ల

నిధులు మంజూరైనా..



అర్వపల్లి నుంచి కొత్తగూడెంకు 6 కి.మీ దూరం ఉంటుంది. ఈ బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయమై కనీసం నడిచి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మూడేళ్ల కిందట బీటీ రెన్యూవల్‌కు రూ.70లక్షలు మంజూరయ్యాయి. అప్పటి నుంచి ఇంత వరకు బీటీ రెన్యూవల్ పనులు చేపట్టడం లేదు. బీటీ రెన్యూవల్ చేపట్టి మా ఇబ్బందులు తీర్చాలి.

– రామసాని రవీందర్, కొత్తగూడెం

పేదలకు ఆసరాగా.. ఉపాధిహామీ



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

తిరుమలగిరి : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉపాధి హామీ పథకం ఆసరాగా నిలుస్తోంది. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఆదుకుంటుంది. అడిగిందే తడవుగా అధికారులు కూలీలకు జాబ్ కార్డులను జారీ చేస్తూ పని కల్పిస్తున్నారు. తిరుమలగిరి మండలంలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలో 4583 జాబ్ కార్డులు ఉండగా 9215 మంది పనులు చేస్తున్నారు. రోజు వారీగా 2900 మంది కూలీలు పనికి వెళ్తున్నారు. ఈ సంవత్సరం నిరవధిక కందకాలు, మళ్లింపు కాల్వలు, గుంతల ఫార్మేషన్, మట్టి రోడ్లు, చెరువుల్లో పూడిక తీత, ఫీడర్ ఛానల్, చెక్ డ్యాముల్లో పూడిక తీత, నర్సరీలో మొక్కల పెంపకం పనులను ఉపాధి హామీ ద్వారా చేపడుతున్నారు.

మూడున్నర కోట్లతో పనులు..

తిరుమలగిరి మండలంలో గత సంవత్సరం 12 నెలల్లో రూ.3.50 కోట్ల పనులు చేపట్టగా ఈ సంవత్సరం రెండు నెలల్లో రూ.90 లక్షల పనులు చేపట్టారు. ఇంకా 9 నెలల పాటు పనులు జరగాల్సి ఉంది.

జాబ్ కార్డులు అందజేస్తున్నాం

జాబ్ కార్డులు లేని కుటుంబాలు దరఖాస్తులు చేసుకుంటే వెంటనే కార్డులను జారీ చేస్తున్నాం. ఆధార్ కార్డుతో పాటు బ్యాంకు ఖాతా జిరాక్స్ అందజేస్తే రెండు, మూడు రోజుల్లోనే జాబ్ కార్డులు అందజేస్తున్నాం. రెండు, మూడు నెలల్లో ఆశించిన మేర పనులు జరిగాయి. కూలీల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకుంటున్నాం. పని చేసే చోట సౌకర్యాలు కల్పిస్తున్నాం. – లక్ష్మి, ఏపీఓ, తిరుమలగిరి

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



తల్లి, పాపలతో అంబులెన్స్ సిబ్బంది

అర్వపల్లి: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ అంబులెన్స్‌లోనే ప్రసవించింది. జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామానికి చెందిన అంకిరెడ్డి నాగరాజు భార్య కళ్యాణి శుక్రవారం పురిటి నొప్పులతో 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వెళ్తుండగా తిమ్మాపురం సమీపంలో ప్రసవించింది. అంబులెన్స్ ఈఎంటీ కె.వీరస్వామి, పైలట్ వల్లాల సత్యనారాయణలు కల్యాణికి సుఖప్రసవం జరిగేలా చేశారు. దీంతో కల్యాణి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలిద్దరికి అంబులెన్స్‌లోనే ప్రాథమిక వైద్యం అందించి సూర్యాపేట ఆస్పత్రిలో చేర్పించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

మునగాల : కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు తీసుకొని రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు, తాటిచెట్లను తొలగించకుండా ఆయా శాఖల అధికారులు చూసి చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మండలంలోని కొక్కిరేణి రోడ్డుపై తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధారావత్ రవి ఆరోపించారు. శుక్రవారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడారు. కొక్కిరేణి రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు, తాటిచెట్లు తొలగించలేదని, దీంతో రాత్రివేళ ఈ రహదారిపై వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం ఓ ద్విచక్ర వాహనదారుడు విద్యుత్ స్తంబానికి ఢీకొట్టి గాయాల పాలవ్వగా, శుక్రవారం ఓ ఆటో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం విరిగిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోగా ఆటో పల్టీ కొట్టిందని తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు



ధర్మాపురంలో వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూజలు చేస్తున్న బుర్రకథ కళాకారుల సంఘం సభ్యులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన ఉత్సవాలను సందర్భంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రకథ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాడిశెట్టి సైదులు, తాడూరి శ్రీనయ్య, సాలం కృష్ణయ్య, తాడూరి వెంకన్న, యడ్ల ప్రేమేందర్, చేరాల భాస్కరాచారి, చేవుగాని అంజయ్యగౌడ్, గ్రామ విశ్వకర్మలు, బుర్రకథ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవం

భానుపురి (సూర్యాపేట) : మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి బోధనలు భవిష్యత్ తరాలకు మార్గదర్శనం చేశాయని పట్టణ స్వర్ణకారు సంఘం అధ్యక్షులు ఆకారపు పరిపూర్ణ చారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం స్వర్ణకారుల వీధిలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 17వ ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని విశ్వకర్మలంతా కలసి ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ స్వర్ణకారు సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహ చారి, ఉపాధ్యక్షుడు దామోదరచారి, కోశాధికారి శంకరాచారి, అనుముల బ్రహ్మచారి, గోవిందా చారి, ఈశ్వరచారి, శ్రీపాద లక్ష్మణ్ చారి ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

భానుపురి (సూర్యాపేట) : దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీ విజయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మండల్ రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీరాం నగర్‌లో శ్రీ విజయాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన మొదటి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. విరాళాల సేకరణ చేపట్టి దేవాలయ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించటంతో పాటు వచ్చే ఆదాయాన్ని అభివద్ధి పథంలో నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూన్ 1న జరిగే హనుమాన్ జయంతిని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగవెల్లి దశరథ, కోశాధికారి యలమద్ది అశోక్ కుమార్, కౌన్సిలర్ సలిగంటి సరితవీరేందర్, అర్చకులు మరింగంటి వరదాచార్యులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి నివాళి



నివాళులర్పిస్తున్న బీరవోలు సోమిరెడ్డి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం వాసి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ తండ్రి మొరిశెట్టి కృష్ణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ) మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా పరామర్శించారు. ఆయన వెంట అడివెంల గ్రామ నాయకులు ఉన్నారు.

గిరిజన గురుకుల బాలికల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

తుంగతుర్తి : తుంగతుర్తి, అవంతిపురం, మిర్యాలగూడలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలల్లో ఈనెల–25న స్పాట్ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని తుంగతుర్తి గిరిజన గురకుల కళాశాల ప్రిన్సిపాల్ నీలా రాణి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లలో ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 10వ తరగతి పూర్తయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు పదవ తరగతిలో సాధించిన జీపీఏ ప్రాతిపదికన అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. స్పాట్ కౌన్సిలింగ్‌కు వచ్చే విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాఫీలు, 4 పాస్‌ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

కుల గణన తర్వాతే నోటిఫికేషన్ ఇవ్వాలి

అర్వపల్లి: కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్నముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్ 50శాతానికి పెంచాలని కోరారు. ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచిన విధంగా ముదిరాజ్ రిజర్వేషన్ అంశాన్ని పరిష్కరించాలని కోరారు. సమావేశంలో మేప మండల అధ్యక్షుడు సాయిన మనోహర్‌ముదిరాజ్, మాదాసు నర్సింహ, వెంకన్న, ఈశ్వర్, అర్వపల్లి, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాములు మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న విశారదన్‌మహరాజ్

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ చిప్పపల్లి నాగార్జున తండ్రి చిప్పలపల్లి రాములు (78)శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, లింగమల్లు యాదవ్, సుధాకర్, విజయ రామరాజు, బాలు, శ్రీనివాస్, నిరంజన్

మృతుడి కుటుంబానికి పరామర్శ



క్రాంతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జగదీష్‌రెడ్డి

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మీజేవైఎం జిల్లా నాయకుడు కొప్పుల క్రాంతికుమార్‌రెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కాంత్రి కుమార్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మర్ల చంద్రారెడ్డి, తూడి నర్సింహారావు, కొణతం సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

సేవాదళ్ తిరుమలగిరి మండల అధ్యక్షుడిగా యాదగిరి



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన దండుగుల యాదగిరిని కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం తెలిపారు. శుక్రవారం తిరుమలగిరిలో నియామక పత్రాన్ని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన శాసన సభ్యులు మందుల సామేల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, మండల అధ్యక్షుడు నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలి

నూతనకల్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన రూ. 2లక్షల రుణమాఫీ పథకాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీని అమలు చేయడంతో పాటు రైతులు పండించిన పంటలకు బోనస్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకట్ రెడ్డి, రాంమ్మూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.

మధుసూదన్ స్ఫూర్తితో ఉద్యమించాలి

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : సాయుధ రైతాంగ పోరాట యోధుడు దేగల మధుసూదన్‌ను స్ఫూర్తిగా తీసుకొని యువత ఉద్యమించాలని సీనియర్ జర్నలిస్టు దేగల జనార్దన్ పిలుపునిచ్చారు. దేగల మధుసూదన్ 34వ వర్ధంతి సందర్భంగా గురువారం రాత్రి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మధుసూదన్ సహచరుడు అబ్బగాని భిక్షం,దేగల వెంకటకృష్ణ,పోరెండ్ల దశరథ,పగిడి యల్లయ్య,శ్రీనివాస్,భద్రయ్య ఉన్నారు.

'ఉపాధి హామీ' రక్షణకు ఉద్యమాలు చేస్తాం



మాట్లాడుతున్న మట్టిపల్లి సైదులు

కోదాడరూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని, ఆ చట్టం పరిరక్షణకు ఉద్యమాలు చేపడతామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల కాలంలో ఉపాధి హామీ చట్టాన్ని తుంగలో తొక్కి కూలీలకు నష్టం జరిగేలా వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. బీజేపీ కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టంలో అనేక మార్పులు తీసుకొచ్చి కూలీల నోట్లో మట్టికొట్టిందని విమర్శించారు. చట్టాన్ని రక్షించుకునేందుకు ఈ నెల 24 నుంచి జూన్8 వరకు జిల్లా వ్యాప్తంగా మోటారు సైకిల్ యాత్ర నిర్వహించి కూలీల సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. జూన్ 10న వేలాది మంది కూలీలతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని అన్నారు. పాన్ కార్డుతో సంబంధం ఉపాధి వేతానాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మిట్టగణుపుల ముత్యాలు, ఒగ్గు సైదులు, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అర్వపల్లిలో భారీ వర్షం



అర్వపల్లి ఆలయం ముందు నిలిచిన నీరు

అర్వపల్లి: అర్వపల్లితోపాటు జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. వివిధ గ్రామాల్లో మామిడి, నిమ్మ తోటలకు నష్టం వాటిల్లింది. అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, ఎమ్మార్సీ భవనం వర్షపు నీటితో నిండాయి. పలు గ్రామాల్లో వీధులు బురదమడుగులుగా మారాయి. కొనుగోలు కేంద్రాల్లో కొంత వరకు ధాన్యం తడిసింది. కాగా అర్వపల్లి, రామన్నగూడెంలలో 365 జాతీయ రహదారిపై వర్షపునీరు నిలిచి వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అర్వపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీలు కూడా జలమయమయ్యాయి.

ముందుకు సాగని పంచాయతీ భవనాల నిర్మాణం

- రెండు చోట్ల స్లాబ్ దశకు వచ్చి నిలిచిన పనులు
- మరో రెండు చోట్ల ఇతర కారణాలతో..
- బిల్లులు సకాలంలో రాక పనులకు అంతరాయం
- వెంటనే భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ప్రజల వినతి



బొల్లంపల్లిలో స్లాబ్ దశలో ఆగిన నిర్మాణం



రామన్నగూడెంలో..

అర్వపల్లి: కొత్త గ్రామ పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరయ్యాయి. సర్పంచ్‌లు అప్పట్లోనే భవనాల నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే నిధులలేమి, ఇతర కారణాలతో కొత్త భవనాల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఈ కారణంగా పనులు మొదలైనవి అర్ధంతరంగా నిలిచిపోగా మరికొన్నిటి పనులు మొదలు కాలేదు. దీంతో కొత్త గ్రామ పంచాయతీ కార్యాలయాలను అద్దె భవనాల్లో నడిపిస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో 4 కొత్త గ్రామ పంచాయతీలను సొంత భవనాలకు నిధులు మంజూరు కాగా రెండిటి పనులు స్లాబ్ దశకు రాగా మరో రెండు ప్రారంభంలోనే ఆగిపోయాయి.

ఒక్కో భవనానికి రూ.20 లక్షలు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు మంజూరు చేశారు. మండలంలోని బొల్లంపల్లి, ఉయ్యాలవాడ, రామన్నగూడెం, సూర్యానాయక్‌తండా గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి రెండేళ్ల కిందట రూ.80లక్షలు మంజూరయ్యాయి. అయితే బొల్లంపల్లి, రామన్నగూడెంలలో భవనాల నిర్మాణానికి సంబంధించి పనులు స్లాబ్ దశలో ఆగాయి. ఉయ్యాలవాడలో స్థల సమస్యతో పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. సూర్యానాయక్‌తండాలో భవన నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చి మెటీరియల్ తెచ్చి పెట్టారు. ఇక్కడ పనులు మొదలు కావాల్సి ఉంది. బొల్లంపల్లి, రామన్నగూడెంలలో నిధులు సకాలంలో విడుదల కాక పనులను నిలిపివేశారు. ప్రభుత్వం నిధులను విడుదల చేసి భవనాల నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రూ. 9లక్షల బిల్లు రావాల్సి ఉంది



మా గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ భవనానికి రూ.20 లక్షల నిధులు మంజూరు కాగా భవన నిర్మాణాన్ని ప్రారంభించాం. స్లాబ్ వరకు నిర్మాణం జరిగింది. రూ.9 లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. ఇబ్బందులు పడుతున్నాం

– రమావత్ పీరమ్మ, మాజీ సర్పంచ్ రామన్నగూడెం

బిల్లులు రాక ఇబ్బంది



పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా అప్పట్లోనే పనులు ప్రారంభించాం. అయితే స్లాబ్ వరకు నిర్మాణం చేపట్టాం. ఏడాదిన్నర నుంచి బిల్లులు రాక ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇంకా రూ.3లక్షల వరకు బిల్లు రావాల్సి ఉంది.

– దానం సుజాతయాదగిరి, మాజీ సర్పంచ్ బొల్లంపల్లి